# చీకటి—వెలుగు

శ్రీ నేతి శ్రీరామచంద్రమూర్తి

పెళ్ళికట్ట డ్రాయరుమీదపడేసి శంకరం తల్లి వంక చూశాడు. ఆవిడ తలవంచుకుని మూటలు కడుతున్నది.

"ఏమిటమ్మా, ఎక్కడికి ప్రయాణం?" అన్నాడు.

నిశ్శబ్దాన్ని చీల్చుకువచ్చిన శబ్దంవిని వెనక్కి తిరిగి చూసింది. మళ్ళీ వెంటనే తలవంచుకుని తనపని చేయసాగింది.

"ఏమైందే మళ్ళీ?" శంకరం విసుగ్గా అన్నాడు.

"నాయనా నీపెళ్ళాం చేతిలో వేగలేనురా నేను. ఇంత ఇదాయిరీను. పెద్దదాన్నిగదా! ఎందుకొచ్చిన గొడవ? ఉదయాన్నే బండిఎక్కించు పోతా! ఎన్నటికైనా వాడేగా నాగొంతులో తులసి నీళ్ళు పోసేవాడు. ముందరే తెలుస్తున్నది అమ్మగారి సంగతి. ఇక కాలు చెయ్యిపడితే ముఖంకూడా చూడదు." అంది కొడుకుతో.

శంకరం సరోజవైపు చూశాడు. ఆమెకళ్ళనుంచి నీళ్ళు కారుతున్నాయి. శంకరం నిట్టూర్చాడు.

లోపలికి పోయాడు శంకరం. సరోజ అతన్ని అనుసరించింది.

"ఊరుకో సరూ! ఆవిడ విషయం నీకు కొత్తగాదుగా!"

సరోజ వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

"జరిగిందేమిటో?"

"ఏమైందీ, ఏదో తప్పుచేసినా సర్దుకుపోవాలిగానీ, ఇలా అల్లరిచేస్తే ఎలా?" అంది బాధగా సరోజ.

శంకరం జాలిగా భార్యవంక చూశాడు.

అతనికి సరోజ మనసు పూర్తిగా తెలుసు. తల్లి మనసూ తెలుసు ఏం జరిగిందో తెలియకపోయినా భార్యని బాధారహితురాలిగా చెయ్యటానికి అన్నాడు.

"ఊరుకో సరూ! ఆవిడ బ్రతికినంత కాలం బ్రతకదు. ఆనాలుగురోజులు కళ్ళుమూసుకుంటేసరి, మంచిదానవంటారు."

"రోజూ చెయ్యటంలేదూ ఆవిడ అడిగిందల్లా ఈరోజేగా చెయ్యనిది. అందుకని మూడు ప్రాణాలను పస్తుపనుకో పెడుతుందా? చూడండి! పొద్దున వండినఅన్నముకూర అలాగే ఉన్నాయి. పిల్లకాయలు మీరు భోజనం చెయ్యకుండా వెళ్ళిపోయారు?" అన్నది బాధగ.

శంకరం జాలిగ చూస్తున్న భార్యమొహం పైకెత్తిచూశాడు.

"ఏదో పెద్దతనం. ఏంచేస్తాం?" అన్నాడు.

శంకరం మళ్ళీ సావిట్లోకి వచ్చాడు.

"ఊరుకో అమ్మా, నీకోడలి సంగతి నీకుతెలీదు? ఇదివరకల్లా నీవన్నదల్లా చేసిపెట్టలా? తప్పుచేస్తుందికే వంకాయకూర." అన్నాడు తల్లితో!

"ఆ! అడిగినవన్నీ చేశారు ఇంతకుముందు? ఇక ముందుచేస్తారు?" అంది సాగదీస్తూ.

"పోనీయమ్మా. అది చిన్నపిల్ల తెలీలేదు గాబోలు" అన్నాడు శంకరం.

"తెలీదుట తెలీదు. ఈయనగారు ఆవిడగార్ని వెనకేసుకువస్తున్నాడు. ఆహా... ఏమి అనుకూల దాంపత్యమండి. అత్తగారికదా ఆమాత్రం భయభక్తులుండక్కర్లా?"

శంకరం మాట్లాడలేదు.

"ఎందుకులే నాయనా? దాని కిలాగూ నేనుండటం ఇష్టంలేదు. పోయొస్తా. పొద్దున్నే నాతో వచ్చి కాస్తబండి ఎక్కిస్తివా నీకింత పుణ్యం ఉంటుంది. కొడుకులు తనవాడైతే కోడలు తనదవుతుందా? ఎంతయినా పరాయి పరాయే!"

"ఉండమ్మా. దానిమొహం దానిమాటలకి నువ్వెళ్ళిపోవటం ఏమిటి?" అన్నాడు శంకరం.

"ఆ చిన్నపిల్లా? ఇరవైఏళ్ళు నెత్తిమీదకున్నాయి,

నాలుగేళ్ళనుంచీ కాపరం చేస్తున్నదీ ఇలాగేనా మాట్లాడటం?" అంది తల్లి కాస్తఘాటుగా.

"ఉందండత్తయ్యా? నాదే తప్పు. నన్ను క్షమించండి" అంది సరోజ మీనాక్షమ్మగారి కాళ్లు పట్టుకుని.

"ఉండనమ్మా!" అంది మీనాక్షమ్మగారు.

"ఉండమ్మా, నిన్ను బతిమాలుకుంటాను ఉండు" అన్నాడు శంకరం.

"ఉండనురేరా! వాడు, అదీ ఉత్తరాలమీద ఉత్తరాలు వ్రాస్తున్నారు—రమ్మని, ఒకసారిపోయి చూసివస్తా."

ఇక తల్లి నాపటం తన తరంకాదనుకున్నాడు శంకరం.

"సరే, నీఇష్టం" అన్నాడు.

శంకరం తండ్రి సూరయ్యగారు ప్రథమ కళత్రం లక్ష్మమ్మగారు శంకరాన్ని ప్రసవించిపోయింది ఈ లోకాన్ని విడిచి. సూరయ్యగారు మీనాక్షమ్మగారిని ద్వితీయ వివాహం చేసుకున్నారు. ఆవిడ మూడేళ్ళ శంకరాన్ని సరిగా చూసింది. తరువాత ఆమెకి గోపాలం పుట్టాడు.

ఇంతలో సూరయ్యగారికి గుండె జబ్బువచ్చింది. "నా కొడుక్కి అన్యాయంచేస్తారు." అని మీనాక్షమ్మగారి ఏడుపులకి పడలేక సూరయ్యగారు ఉన్న పదిహేనెకరాల మాగాణిపొలం, ఇల్లు మీనాక్షమ్మకి చెందేటట్లు వ్రాశారు.

సూరయ్యగారు కన్నుమూశాడు. పోతూపోతూ శంకరాన్ని చాటుగపిలిచి, "మీనాన్న నీకేమి ఇవ్వటంలేదు శంకరం. నీకాళ్ళమీద నువ్వు నిలబడు మీనాన్న ఆత్మశాంతిస్తుంది. అది నీకేమి ఇవ్వదు. వాడసలు లాభంలేదు! ఎప్పుడూ వాడికి డబ్బులిస్తుంది అడగంగానే. అదేవాడిని చెడగొడుతున్నది. నువ్వే మీఅమ్మకి ఆధారం. నువ్వే దాన్ని పోషించాలి. మంచివాడివనిపించుకో" అన్నాడు.

శంకరం "అలాగేనాన్న! మీరు చెప్పినట్లే చేస్తాను." అన్నాడు చిక్కిపోయిన తండ్రి అరచేతిమీద తన చెయ్యిపెట్టి.

కొడుకుమీదో, కోడలిమీదో కోపంరావటం తత్ఫలితంగా గోపాలందగ్గర రెండు రోజులో మూడు రోజులో ఉండటం వందో రెండో సమర్పించుకు తిరిగి రావటం ఆవిడకి పరిపాటే!

శంకరం క్యాలెండైనలకి గానీ 'ఇక నే చెప్పేందుకు లేను నాయనా! ఆమూరాజు నాకేమిచ్చాడు!" అంది మీనాక్షమ్మ.

శంకరం చదువాగిపోయింది.

సైఫు పార్టుపొందు చేర్చుకున్నాడు. నెలకి తొంభైరూపాయలకి ఉద్యోగంలో ప్రవేశించాడు.

గోపాలం బి. ఏ. పూర్తయింది. చదువుకున్న పిల్లని చేసుకున్నాడు.

మర్నాడు పొద్దున్నేపోయి రైలెక్కించాడు శంకరం. "త్వరగా రామ్మా." అన్నాడు రైలు కదులుతుంటే. దారిలో అతననుకున్నాడు, "నామాట నేను నిలుపుకున్నాగదా?"

సరోజను చూస్తే కడుపు తరుక్కుపోతుంది శంకరానికి తనచేతులా ఓ చీరకొని, "సరూ! కట్టుకో" అని అన్న పాపానపోలేదు. కాకపోతే దారిలో వస్తూ వస్తూ ఓఅణావో బేడనో ఎప్పుడన్నా మల్లెపూలు తెచ్చేవాడు. అంతే దానికే సంతోషించేది! 'పిచ్చిపిల్ల!' అనుకున్నాడు.

"సరూ! నా భార్యకావటం నా అదృష్టం." అనుకునేవాడు. అంతే, "ఆమె ఏంసుఖపడుతున్నది?" అని విచారించేవాడు. ఆమాట సరోజ ముందంటే, "చాల్లెండి! చీరలుకొని, నగలుపెడితే నేనా సుఖపడ్డట్లు." అని కోప్పడేది.

తల్లికి పదిహేనెకరాల్లోంచి వచ్చిన ధనమంతా గోపాలానికి అర్పిస్తుంది!

అన్నం వడ్డిస్తున్న సరోజచేతికిఉన్న మట్టిగాజులు చూసి బాధగ నిట్టూర్చాడు శంకరం.

"ఎందుకట్లా బాధపడతారు?" అంది సరోజ.

"ప్రతినెలా చీరకొందామనుకోటం కావలేక పోవటమూను. ఈనెల కొనాల్సిందే. కొని తీరుతాను. మీవాళ్ళింటికి వెళ్లితే మీనాన్న ధర్మమాఅని ఇచ్చిన చీరలు కట్టుకుంటున్నావు? ఛీ! ఛీ. ఎందుకీ భర్త ఉండి." అంటచేత్తోనే ఆవేశంగా తలకొట్టుకొని లేచిపోయాడు. సరోజ నిర్ఘాంతపోయింది.

పదిహేను రూపాయలు పెట్టలేక చస్తుంటే తల్లి "పెద్దఇల్లో" అని గొడవపెడుతుంది.

"ఏం? తీసుకొని వ్వాగూడదూ?" అనుకున్నాడు శంకరం.

"ఇంకా తను మంచివాడు. లేకపోతే అంతడబ్బు ఉండి, తనకు ఇన్నేళ్ళనుంచి చిల్లికాని ఇవ్వక పోయినా- అతను అనుకున్నాడు ఇంకా."

పనిగట్టుకుని అఫీసరు తనతో నానామాటలు అంటాడు.

నిశ్శబ్దంగాఉన్న నీటిలో చలనం కలగటం ఎంత సేపు?

ఒక్కొక్కరోజు శంకరం అనుకునేవాడు. "నే నెందుకు బ్రతుకుతున్నాను? నేను లేకపోతే సరు మరొకడ్ని చేసుకుని సుఖపడేది." తన అవతారంవంక చూసుకున్నాడు, బాధగా ఏడుపొచ్చింది. విధిగా అతని వేళ్ళు టైపుమిషనుమీద నాట్యంచేస్తున్నాయి!

విజయవాడ స్టేషన్‌లో రైలుఆగింది. ఇంజను మోత స్టేషనంతా వ్యాపిస్తున్నది. మీనాక్షమ్మ మూటలు తీసుకుని దిగింది. గవర్నరుపేటవైపు వెళ్ళిపోయింది.

వీధివాకిలిముందు రిక్షాఆగిన శబ్దంవిని గోపాలం వాకిట్లో కొచ్చాడు.

"రా అమ్మా, రా. రా. ఎన్నాళ్ళకొచ్చావు?" అన్నాడు. తల్లి పరవశం చెందింది. క్షణంసేపు మాట రాక నిలబడిపోయింది.

"విమలా! విమలా!" భార్యని కేకేశాడు.

లోపల్నుంచి పదినిముషాలకి వచ్చింది విమల. స్వంతకోడల.

"మాఅమ్మ వచ్చిందే" అన్నాడు.

"రండి. రండి. ఎన్నాళ్ళకొచ్చారు" అంది విమల.

"నీళ్లతోడు త్వరగా ఎప్పుడు బయలుదేరిందో" అన్నాడు కొడుకు. విమల లోపలికిపోయింది.

కొడుకు ననుసరించి తల్లికూడ లోపలికి వెళ్ళిపోయింది.

"ఈసారైనా ఆస్తి వ్రాయిస్తారా వ్రాయించరా?" అంది చాటుగ భర్తతో విమల.

"వ్రాయిస్తాను." అన్నాడు భార్యతో అతను "కాని, నువ్వు ఈనాలుగురోజులు నెత్తిన బెట్టుకోవాలి."

"ఏ నాలుగురోజులు?"

"బ్రతికున్న నాలుగురోజులు. ఎంతయినా కన్న కొడుకు."

"అలాకుదరుడు. ఆస్తిఇచ్చేదాకా మాత్రం." అంది విమల. గోపాలం క్షణంసేపు ఆలోచించాడు.

"సరే. నీయిష్టం."

తల్లి వెళ్లి నాలుగురోజులైన రాకపోయేసరికి శంకరం బాధపడ్డాడు.

మీనాక్షమ్మగారికి ఓరోజు పక్షవాతం వచ్చింది ఉన్నట్టుండి.

ఆరోజు మధ్యాహ్నం గోపాలం తల్లిదగ్గర ఆస్తి విషయం ప్రస్తావించాడు,

"అమ్మా! నీకాపక్షవాతం వచ్చింది. డాక్టరుగారేమో [illegible] అంటున్నారు. ఆస్తి శంకరానికి ఇస్తావో, ఇంకెవరికిస్తావో చెపితే ఏదో ఏర్పాటుచేస్తాను." అన్నాడు దిగులుగా ముఖంపెట్టి.

మీనాక్షమ్మ అతనిమాటలు గ్రహించినట్లు చూసింది.

"అంతఆస్తి నీకిస్తారా. ఇది మీనాన్నగారి కష్టార్జితము—నాకు సర్వహక్కులతో వ్రాసిఇచ్చారు" అంది మీనాక్షమ్మ.

"మరి శంకరానికో?" అన్నాడు. పైకి

"ఆ. వాడు నామాటేం విన్నాడు? కమలని చేసుకున్నాడా? పైగా వాడిమీద నాకెందుకుంటుంది?" అంది.

ఇద్దరు పెద్దమనుష్యులఎదుట, తెల్లనిచేత నల్లని కాటుకపూసి వేలుముద్ర వేయించారు. ఆస్తిఅంతా గోపాలంపేర రిజిస్టరయిపోయింది.

ఆరోజు ఆవిడకి తిండితిప్పలు సరిగా వేళకివచ్చినయి. కోడలు స్వయంగా చేత్తో అన్నంకలిపి నోట్లో పెట్టింది. కాళ్ళుపట్టింది. ఉపచారాలుచేసింది.

మీనాక్షమ్మ సంతోషించింది.

(362 వ పేజి చూడుడు)